క్లుప్తంగా

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లెందు: పోలీస్ ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులు సింగరేణి సేవా సమితి అందజేసిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం షాలేమురాజు కోరారు. సోమవారం ఇల్లెందు ఏరియా జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేసి మాట్లాడారు. పోలీసు నియామక మండలి నిర్వహించే తుది పరీక్షలో అర్హత కలిగిన అభ్యర్థులకు సింగరేణి పాఠశాలలో తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. పేద అభ్యర్థులకు ఉచిత మెటీరియల్ అందజేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సింగరేణి అధికారులు, హెచ్‌ఎంలు టి.వెంకటేశ్వర్లు, సుధాకర్ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 22, 23 తేదీల్లో ఢిల్లీలో జరిగే ఐఎన్‌టీయూసీ ప్లీనరీ సమావేశాలకు శ్రేణులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని సంఘం కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు కేడం ఆల్బర్ట్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి ఆదేశానుసారం జాతీయ ప్రధాన కార్యదర్శి, యూనియన్ జనరల్ సెక్రటరీ బి.జనక్‌ప్రసాద్ పిలుపుమేరకు సింగరేణి నుంచి వేలాది మంది ప్రతినిధులు, కార్యకర్తలతో ఢిల్లీకి తరలివెళ్లాలని కోరారు. ప్లీనరీలో సింగరేణిలో జరుగుతున్న ఆర్థిక దోపిడీ, కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జీత భత్యాలు, ఉద్యోగ భద్రత.. తదితర అంశాలపై చర్చ జరుగుతుందని చెప్పారు.

బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్

జూలూరుపాడు: ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి కొమ్ముగూడెం గ్రామంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేశ్ మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంకుశ, అవినీతి కుటుంబ పాలన సాగిస్తోందని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు పరచడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తోందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి, అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి నున్నా రమేశ్, భూక్యా శ్రీను, సిరిపురపు ప్రసాద్‌రావు, ప్రజలు పాల్గొన్నారు.

మందిరంలో ప్రత్యేక పూజలు

పాల్వంచరూరల్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం మెగాస్టార్ చిరంజీవి, సుకుమార్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా మెగా ఫ్యాన్స్ అధ్యక్షుడు ఖాసీం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు, యాచకులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ఖాసీంఖాన్, నాగరాజు, సాయి, ఇర్ఫాన్, హరీశ్, సందీప్, శ్యామ్, డేవి, సిద్ధు, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

టేకులపల్లి: మండలంలోని బిల్లుడుతండా పంచాయతీలో జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య సోమవారం పర్యటించారు. జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీర గలక, ఎంపీటీసీ సభ్యుడు భూక్య శంకర్, రమాదేవి పాల్గొన్నారు.

అక్షరాస్యతపై అవగాహన

టేకులపల్లి: రైతులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకులు అందించే సేవలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, డీసీసీబీ మేనేజర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం రాత్రి బొమ్మనపల్లి తండాలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రస్తుతం ఆర్థిక, సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ఖాతాదారులు, రైతులు తమ పిన్ నెంబర్, వ్యక్తిగత వివరాలు ఎవరైనా ఫోన్‌లో అడిగితే చెప్పరాదని, బ్యాంకులు సంబంధించిన వ్యక్తిగత వివరాలు, పిన్ నెంబర్ బ్యాంకు వారు ఎప్పటికీ ఫోన్ ద్వారా అడగరని తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చారి, ప్రశాంత్, కళాకారులు, రైతులు పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే..

టేకులపల్లి: చట్టం ముందు అందరూ సమానమేనని, సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వారికి ఎలాంటి భేదభావాలు లేకుండా న్యాయం చేస్తామని టేకులపల్లి ఎస్‌ఐ గడిరెడ్డి యుగంధర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు.

పోడు పట్టాలపై ఉత్కంఠ

- నేటికీ పలు ప్రాంతాల్లో తేలని సరిహద్దుల వివాదం
- అర్హుల నిర్ధారణలో నిబంధనలపై సర్వత్రా ఆందోళన
- జాబితాలో గిరిజనేతరులకు చోటుపై నీలినీడలు
- తుదిదశకు చేరిన ఆర్‌ఓఎఫ్‌ఆర్ లబ్ధిదారుల ఎంపిక


ఇల్లెందు ఏజెన్సీలో పోడు భూమి సాగు చేసుకుంటున్న రైతు (ఫైల్)

ఇల్లెందురూరల్: ఏజెన్సీలో 2005 డిసెంబర్ 13వ తేదీకి ముందు పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని కొన్నేళ్లుగా ఉద్యమాలు కొనసాగాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈ అంశం ప్రచారాస్త్రంగా మారగా.. మరోసారి సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండగా పోడుభూముల సమస్య తెరపైకి వచ్చింది. ఈ క్రమంలో నిబంధనలకు లోబడి అటవీ భూముల్లో పోడు సాగు చేస్తున్న రైతులకు హక్కు పత్రాలు ఇవ్వనున్నట్లు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరించడమే కాక క్షేత్రస్థాయిలో అధికారులతో పరిశీలన కార్యక్రమం పూర్తి చేయించింది. ఇక ఎఫ్‌ఆర్‌సీ కమిటీ గ్రామసభల ఆమోదంతో హక్కు పత్రాల ప్రక్రియ తుది దశకు చేరడంతో అర్హులకు న్యాయం జరుగుతుందా, లేదా అని గిరిజన, గిరిజనేతర సాగుదారులు ఎదురుచూస్తున్నారు.

విలీన భూముల సమస్య ప్రశ్నార్థకం

సమగ్ర భూ రికార్డుల ప్రక్షాళన సమయాన మండలంలో భూములకు సంబంధించి అధికారులు స్పష్టత ఇచ్చారు. మండలంలో మొత్తం 98,635 ఎకరాలు ఉండగా అందులో పట్టాభూమి 17,781.35 ఎకరాలు, అటవీ భూమి 61,940.03 ఎకరాలుగా నిర్ధయించారు. అప్పటివరకు ప్రభుత్వ భూమిగా ఉన్న 61,940.03 ఎకరాలను అటవీశాఖకు అప్పగించడంతో ఆ భూమిపై పట్టాలు కలిగి సాగు చేసుకున్న గిరిజన, గిరిజనేతర రైతులకు నష్టం జరిగింది. సర్వే నంబర్ 479 పరిధిలో 185 ఎకరాలు, సర్వే నంబర్ 549 పరిధిలో 35 ఎకరాలను గతంలో రైతులకు ప్రభుత్వం అసైన్ చేసినా, రికార్డుల ప్రక్షాళన సమయాన అటవీభూమిగా ప్రకటించారు. అలాగే, సర్వే నంబర్ 317లో 124.14 ఎకరాలు, సర్వే నంబర్ 588 పరిధిలో 400 మంది రైతులకు వేలాది ఎకరాలు పట్టాలిచ్చినా రికార్డుల ప్రక్షాళన అనంతరం అటవీ భూముల జాబితాలో చేరాయి. ఇక ఇల్లెందు రేంజ్ పరిధిలోని 3195.192 ఎకరాల భూమి రెవెన్యూ, అటవీశాఖ పరిధిలో సరిహద్దులు తేలక పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఆ భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతరులకు పట్టాలపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

సర్వే సమయంలోనే అన్యాయం

గతంలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు లేని అటవీ భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకొని ట్రెంచ్ కొట్టగా.. కొందరు రైతులు మాత్రమే అడ్డుకోగలిగారు. 2005 తర్వాత పోడు చేసిన భూములు.. ఇలాంటి వారి వద్దే అధికంగా ఉన్నాయనే ఆరోపణలు లేకపోలేదు. రాజీవ్‌నగర్ తండా గ్రామ సమీపంలో కంపార్ట్‌మెంట్ 51 పరిధిలో 28 మంది రైతులకు సంబంధించి 94 ఎకరాల భూమిని అటవీశాఖ అధికారులు 2018లో స్వాధీనం చేసుకున్నారు. కానీ రైతులు ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకోవడంతో ప్రత్యేక సర్వే చేయించి డీఎఫ్‌ఓ అప్రూవల్‌కు సిద్ధంగా ఉన్న పట్టాలివ్వలేదు. ఇక ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇవ్వవని ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో సింగరేణి కార్మికులకు నష్టపోనున్నారు. 2005 సమయాన సింగరేణి కార్మికులకు వేతనాలు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలే ఉండగా ఇల్లు గడవక గిరిజన తెగకు చెందిన కార్మికులు పోడు కొట్టేవారు. ఇప్పుడు వారి పేర్లు జాబితా నుంచి తొలగించినట్లు తెలుస్తుండగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, మూడు తరాలకు సంబంధించిన ఆధారాలు చూపించాలనే నిబంధన గిరిజనేతరుల పాలిట శాపంగా మారింది. దీంతో అర్హతలు ఉన్నా చాలామంది ఆధారాలు చూపించలేక పోడు పట్టాలకు దూరమవుతున్నారని తెలుస్తోంది. ప్రధానంగా మండలంలోని కొమరారం, మాణిక్యారం, రాముబోయినగూడెం తదితర గ్రామాల్లో ఈ సమస్య కనిపిస్తోంది.

నా పేరు తీసేయడం సరికాదు



నేను గతంలో సింగరేణిలో పని చేశా. అప్పట్లో రూ.1,200 వేతనమే ఉండడంతో పోడు నరుక్కొని సాగు చేసుకున్నాం. కానీ ప్రస్తుతం ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాల పంపిణీలో నా పేరు జాబితా నుంచి తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో నాకే కాదు చాలా మందికి అన్యాయం జరుగుతోంది.

–హరిసింగ్, రైతు, విజయలక్ష్మీనగర్

సర్వే దశలోనే అన్యాయం చేశారు



రాజీవ్‌నగర్‌తండా కంపార్ట్‌మెంట్ 51 పరిధిలో 28 మంది రైతులం 94 ఎకరాలు సాగు చేసుకుంటున్నాం. ఆ భూమిని 2018లో స్వాధీనం చేసుకోగా, ఇప్పుడు 2005కు ముందు నుంచే సాగు చేస్తున్న వారికి పట్టాలు ఇస్తామని చెబుతున్నారు. కానీ సర్వేలో మమ్ముల్ని పరిగణనలోకి తీసుకోలేదు.

–పూనెం సూర్యనారాయణ, రైతు, పోలెంపల్లి

మూడు తరాల నిబంధన ఏమిటి?



గిరిజనేతరులకు మూడు తరాలకు సంబంధించిన ఆధారాలు చూపిస్తే ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు ఇస్తామని అధికారులు ప్రకటించడం సరైందికాదు. అన్ని అర్హతలు ఉన్నా ఆధారాలు చూపించలేక చాటు కోల్పోయాం. ప్రభుత్వం నిబంధనలు సడలించి అర్హులైన గిరిజనులకు న్యాయం చేయాలి.

–మంచె రమేశ్, రైతు, కొమరారం

సమావేశం నిర్వహించాలి


మాట్లాడుతున్న పి.మాధవ్‌నాయక్

సింగరేణి(కొత్తగూడెం): 11వ వేతన సవరణలో భాగంగా 9వ సమావేశం వెంటనే నిర్వహించాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవ్‌నాయక్ డిమాండ్ చేశారు. జేబీసీసీఐ సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి మూడు రోజులపాటు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో భాగంగా సోమవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకేఓసీలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. 11వ వేతన వేజ్‌బోర్డ్ 9వ సమావేశం నిర్వహించడంలో కోలిండియా యాజమాన్యం, సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఈ నెల 21న సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట నిర్వహించతలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎంఎస్ పవన్‌కుమార్, సంగం చందర్, ఏరియా ఉపాధ్యక్షులు మొగిలిపాక రవి, పటేళ్ల, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేస్తున్నారని ఫిర్యాదు..

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో అధికార పార్టీ కౌన్సిలర్ల పోరు రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా ఎస్పీ డాక్టర్ వినీత్‌కు రిజిస్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు పంపినట్లు 19వ వార్డు కౌన్సిలర్ పత్తి స్వప్న భర్త రంజిత్‌కుమార్ సోషల్ మీడియా ద్వారా సోమవారం వెల్లడించారు. ఏడాది కాలంగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తన భార్య పత్తి స్వప్నను వేధించాడని, వార్డులో అభివృద్ధి నిధులు అడిగితే ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. జనవరి అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చాక తన సమీప బంధువులతో ఇంటి మీదకు వచ్చి తనపై దాడి చేశారని పేర్కొన్నారు. ఈ విషయం పలు దఫాలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోనందున తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): గ్రామ పంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ నేతృత్వంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం పాల్వంచ మండలం జగన్నాథపురం పెద్దమ్మగుడి నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పది కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేశ్, అధ్యక్షుడు బ్రహ్మచారి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాదయాత్రకు పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు, జేసీసీ హమాలీ యూనియన్, ఆర్టీసీ అద్దె బస్సుల యూనియన్ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో జె.పద్మ, గద్ద శ్రీను, పిట్టల అర్జున్, డి.వీరన్న, కె.సత్య, దొడ్డ రవికుమార్, నరసింహారావు, భూక్య రమేశ్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు జారీ చేయడంలో విఫలం


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జూలూరుపాడు: నిరుపేద ప్రజలకు రేషన్ కార్డులు జారీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పీవైఎల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పగడాల అఖిల్, ఎస్కే చాంద్‌పాషా ఆరోపించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మీసేవ కేంద్రాల్లో నిరుపేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్నప్పటికీ ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్నట్లు చూపిస్తోందని తెలిపారు. రేషన్ కార్డుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అర్హులైన వారిని గుర్తించి రేషన్ కార్డులు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు నరేశ్, గంజి మధు, వీరస్వామి, సురేశ్ పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులకు మోక్షం


స్తంభం ఏర్పాటు చేసేందుకు కట్టిన పిల్లర్

సుజాతనగర్: మండల కేంద్రం సుజాతనగర్‌లో ఎట్టకేలకు సెంట్రల్ లైటింగ్ పనులకు మోక్షం లభించింది. 12వ రాష్ట్రీయ రహదారి విస్తరణకు సంబంధించి డివైడర్ల నిర్మాణం పూర్తయి రెండేళ్లు గడిచినా ఇంతవరకు సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయలేదు. సెంట్రల్ లైటింగ్ పనుల్లో జాప్యం తలెత్తడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రజా ప్రతినిధులు, ప్రజల విజ్ఞప్తుల మేరకు సీడీపీ (నియోజకవర్గ అభివృద్ధి నిధులు) రూ.38 లక్షలతో చేపట్టిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. 1.4 కిలోమీటర్ల మేర సుమారు 27 మీటర్లకు ఒక్కటి చొప్పున మొత్తం 27 స్తంభాలను డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేయనున్నారు.

'ధరణి' సమస్యలు పరిష్కరించాలి

టేకులపల్లి: ధరణి వల్ల రైతులు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా దేవానాయక్ కోరారు. సోమవారం పార్టీ బృందం సూతనంగా విధుల్లో చేరిన తహసీల్దార్ వీరభద్రంను కలిసి వినతిపత్రం అందజేశారు. ధరణి వ్యవస్థ కారణంగా చేసుకుంటే పెద్ద సమస్యలు, కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయని పేర్కొన్నారు. వందలాది మంది రైతులు ధరణి వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పొరవ తీసుకుని ధరణి బాధిత రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆకారపు స్వప్న, ఇస్లావత్ నామానాయక్ పాల్గొన్నారు.

కవయిత్రి ఇందిరకు టీఎస్‌యూటీఎఫ్ నివాళి


నివాళులర్పిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు

ఇల్లెందురూరల్: రిటైర్డ్ ఉపాధ్యాయురాలు, ప్రముఖ కవయిత్రి బైరి ఇందిర మృతిపై టీఎస్ యూటీఎఫ్ బాధ్యులు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా సోమవారం వారు ఇందిర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయురాలిగా ఉత్తమ సేవలందించడమే కాక కవయిత్రిగా సమాజాన్ని మేల్కొల్పేలా ఎన్నో రచనలు చేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో శేషగిరిరావు, అన్నపూర్ణ, శేషగిరి, రామచంద్రయ్య, పాపారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే హరిప్రియ


8వ వార్డులో సమస్యలు వింటున్న హరిప్రియ

ఇల్లెందు: రెండు రోజులుగా పట్టణంలోని పలు వార్డులలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ దృష్టికి సమస్యలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం పట్టణంలోని 3వ వార్డులో పర్యటించిన సందర్భంగా అక్కడి ప్రజలు వాగు మీద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. అదే బస్తీలో నీరు సక్రమంగా విడుదల చేయడం లేదని ఫిర్యాదు చేశారు. 4వ వార్డులో అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణం చేయాలని అక్కడి కౌన్సిలర్ సయ్యద్ ఆజమ్ కోరారు. 5వ వార్డు గుండా ప్రవహించే బుగ్గవాగు మీద ఇరువైపులా కాకతీయ వర్లాలాంలో చెత్తాచెదారంతో నిండి వర్షం నీరు పొంగి ఇళ్లల్లోకి చేరుతోందని కౌన్సిలర్ వీణ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. 6, 7, 8 వార్డుల్లో భజన మందిరం చుట్టూ రోడ్డు నిర్మాణం, ఎస్సీ కమ్యూనిటీ భవన్ నిర్మాణం, రోడ్లు, కాలువల నిర్మాణం చేయాలని కోరారు. సమస్యలను ఆయాశాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కమిషనర్ అంకుషావలి, డీఈ రామకృష్ణ, ఏఈ శంకర్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

టేకులపల్లి: మండలంలోని చింతోనిచెలక పంచాయతీ వక్కొరగుంపులో ఈ నెల 14వ ప్రారంభమైన వజ్జ అరుణ్ కుమార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. మొత్తం 24 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. సోమవారం జరిగిన కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన పెట్రాంచెలక పీటీసీ వారియర్స్ జట్టుకు రూ.10,016, ద్వితీయ స్థానంలో నిలిచిన ఓఎస్‌డీ పోలీసు కొత్తగూడెం జట్టుకి రూ.5,016 నగదు, షీల్డులు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఈసం రామకృష్ణ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కల్తీ బ్రహ్మాజి వసం చేసుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకుడు వజ్జ అజయ్, పెట్రాంచెలక సర్పంచ్ హనుమంతు, ఉప సర్పంచ్ నగేశ్, ఈసం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జూలూరుపాడు: జూలూరుపాడు న్యూ కాలనీకి చెందిన ప్రైవేట్ టీచర్ వేమూరి కనకయ్య సతీమణి అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం పూర్వ విద్యార్థులు రూ.4,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాదగుల నాగరాజు, మోదుగు గోవర్ధన్, గోలి సెల్వరాజ్, తగరం అశోక్, కత్తి కృష్ణ, డి.రవి, ఎ.కోటేశ్, కొపేమల్ల సురేందర్, ఎన్.శ్రీను, రమేశ్, కృష్ణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'హాథ్ సే హాథ్' జోడోయాత్ర


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పోట్ల నాగేశ్వరరావు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామంలో సోమవారం మాజీ ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర సందేశ కరపత్రాలను విడుదల చేసి విస్తృత ప్రచారం చేశారు. ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ జేబీ శౌరిబాబు, మోదుగు ధర్మారావు, ఏనుగుల అర్జున్‌రావు, గద్ద రాజశేఖర్, అల్లాడి నర్సింహారావు, అజ్మీర సురేశ్‌నాయక్, మహ్మద్ ఉస్మాన్, సాయి, మల్లేశ్, రామారావు పాల్గొన్నారు.

మీరు పెంచి పోషించిందే అసమ్మతి..

- తప్పుడు ఆరోపణలు తగదు
- కోరం కనకయ్య వర్గం నాయకులు


మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఇల్లెందు: 'మున్సిపల్ అసమ్మతి పోరు మీరు పెంచి పోషించిందే.. గొట్టుకోలు అయ్యే రోజు దగ్గర పడటంతో ఆ నెపం కనకయ్య మీద నెట్టి తప్పించుకుంటారా..' అని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య వర్గం నాయకులు ఎమ్మెల్యే హరిప్రియపై మండిపడ్డారు. తొమ్మిది నెలలుగా రగులుతున్న అసమ్మతిని చక్కదిద్దుకోలేకపోవడం చేతకానితనానికి నిదర్శనమని పేర్కొన్నారు. సోమవారం కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యులు మండల రాము, పూనెం సురేందర్, కృష్ణప్రసాద్, తాటి యోగేంద్ర, సర్పంచ్‌లు స్వాతి, కవిత, భాగ్యమ్మ, తాటి దుక్కమ్మ, పాయం లలిత, కల్తీ పద్మ మాట్లాడారు. అసమ్మతి కౌన్సిలర్లు 2022 జూన్ 20న తేదీన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, అయినా ఇప్పటివరకు ఎందుకు పరిష్కరించుకోలేదన్నారు. విధ్వంసకర చర్యలు ప్రజలు, బీఆర్‌ఎస్ అధిష్టానం గమనిస్తోందని పేర్కొన్నారు. భయపడే మాత్రమే నాయకులు 'మీ' వెంట నడుస్తున్నారని, గౌరవంతో కాదని చెప్పారు. సమావేశంలో నాయకులు సూర్యబాక సత్యనారాయణ, మూతి కృష్ణ, తాటి భిక్షం, నాగరాజు, శారద, ప్రసన్న, బలయ్య, తాటి రాంబాబు, కృష్ణ, భార్గవ్, కృష్ణ, అంజనేయులు పాల్గొన్నారు.

న్యూగొల్లగూడెంలో అన్నదానం

కొత్తగూడెంటౌన్: పట్టణ పరిధిలోని న్యూగొల్లగూడెం రాజీవ్ గృహ కల్ప కాలనీలో ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్

మందు బాబుల అడ్డా..



టేకులపల్లి మండలం శంభునిగూడెంలో ఉన్న ఎంపీయూపీఎస్ సమస్యలకు నిలయంగా మారింది. డ్రైయినేజీ వ్యవస్థ కనిపించదు. నీటి వసతి లేదు. ప్రహరీ పూర్తిస్థాయిలో నిర్మించకపోవడం వల్ల మందుబాబులు సెలవు రోజుల్లో, రాత్రి వేళల్లో పాఠశాలను అడ్డాగా మార్చుకున్నారు. తరగతి గదుల్లో మద్యం సేవించడం, సీసాలు ఇష్టం వచ్చినట్లు గదుల్లోనే పడేయడం, ఆఫీస్ గది, తరగతి గదుల తలుపులు పగులకొట్టడం లాంటివి చేస్తున్నారు. తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పదుం బిగిస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ పాఠశాలలో సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

–టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: ఠాకూర్ రాంసింగ్ ఎంఈఓ, టేకులపల్లి
సెల్ నంబర్: 98495 53542